క్లుప్తంగా

మే 3 నుంచి ఎర్నిమాంబ మహోత్సవాలు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట గ్రామదేవత ఎర్నిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలు మే 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు గరికిన కింగ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 3న తొలేళ్ల పండగతో పాటు ఆంధ్ర ఖవ్వాలి, 4న నేల వేషాలు, బల్ల వేషాలు, బాణసంచా కార్యక్రమం, 5న సాంస్కృతిక కార్యక్రమాలు, 6న అమ్మవార్ల ఊరేగింపు జాతర, బాణసంచా పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 7న వివిధ కళాకారులతో స్టేజ్ ప్రోగ్రామ్స్ అనంతరం ఆ రోజు రాత్రి 7 గంటల నుంచి రావణాసురుడి లంకా దహనం, 8న గాంధీ మహాత్ముని ఊరేగింపు, అమ్మవారి జాతర నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

దుర్గాలమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మధురవాడ: చైత్ర మాసం, శుక్ల పక్ష చతుర్దశిని పురస్కరించుకుని చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పట్నాల హరి ప్రసాద్ శర్మ, మూర్తి శర్మ ఆధ్వర్యంలో నిత్యపూజలు, సుగంధ, పంచామృత అభిషేకాలు, అర్చనలు చేశారు. దుర్గానగర్ వాస్తవ్యులు రామారావు, లక్ష్మి దంపతుల సహాయ సహకారంతో అమ్మవారికి పులిహోర, ఇతర నైవేద్యాలు నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సెలవుల్లోనూ జీవీఎంసీ 'సౌకర్యం'

మధురవాడ: జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలోని సౌకర్యం కేంద్రం ఈ నెల 30వ తేదీ వరకు సెలవు దినాల్లో కూడా పని చేస్తుందని జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి తెలిపారు. రోజూ ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు తెరచి ఉంటుందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఈ నెలాఖరులోగా చెల్లిస్తే, 5 శాతం రాయితీ ఉంటుందని తెలియజేశారు. నగర పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, నీటి పన్ను చెల్లించి జీవీఎంసీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలి

తగరపువలస: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆనందపురం కూడలి నుంచి ఆర్కే బీచ్‌లో కాళీమాత ఆలయం వరకు శనివారం చేపట్టనున్న హనుమాన్ శోభాయాత్ర ద్విచక్ర వాహన ర్యాలీని జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ ప్రతినిధి తమ్మిన నరసింగరావు కోరారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఆనందపురంలో ప్రారంభమైన ర్యాలీ మధురవాడ, పీఎం పాలెం, విశాలాక్షినగర్, తెన్నేటి పార్కు మీదుగా కాళీమాత ఆలయానికి చేరుకుంటుందన్నారు. అనంతరం బీచ్‌రోడ్డులో శోభాయాత్ర నిర్వహించనున్నట్టు తెలిపారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ శ్రీధర్

పద్మనాభం: త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్‌ను పద్మనాభం పోలీస్ స్టేషన్‌లో సీఐ సి.హెచ్.శ్రీధర్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, జి.కృష్ణ సూరప్పుడు, వి.సురేష్, ఎస్.శ్రీనివాస్, బి.పైడన్న పాల్గొన్నారు.

సచివాలయాల చిరునామా మార్పు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ బొగ్గు రోడ్డు సుఖీభవ కాలనీ వద్ద ఉన్న బొగ్గు రోడ్డు-1,2 సచివాలయాల చిరునామాను జీవీఎంసీ అధికారులు మార్చివేశారు. కొత్తపేట, చిట్టివలస, జ్యూట్‌మిల్లు క్వార్టర్స్ ప్రజలకు దూరంగా ఉన్నందున శుక్రవారం నుంచి వీటిని తగరపువలస పాత మీసేవా కేంద్రంలోకి మార్చారు.



మంగమారిపేట బీచ్ వద్ద ఇసుక తరలించడంతో భారీగా ఏర్పడిన గోతులు

తీరాన్ని తవ్వేస్తున్నారు

నదులు, చెరువులు, వాగుల్లోని ఇసుకనే కాదు, సముద్ర తీరంలో ఇసుకను కూడా ఇష్టానుసారం కొల్లగొడుతున్నారు. ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్నారు. సాగరతీరాన్ని చెరువులుగా మార్చేస్తూ మత్స్య సంపదకు, ప్రకృతికి విఘాతం **కలిగిస్తున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. భీమిలి తీరం ఈ అరాచకానికి కేంద్రంగా మారింది.**

- బీచ్‌లో ఇష్టానుసారం ఇసుక తవ్వకాలు
- మంగమారిపేట తీరంలో భారీ గోతులు
- పొంచి ఉన్న పెనుప్రమాదం
- ఆందోళనలో మత్స్యకారులు



తీరం వెంబడి ఇసుక కోసం తవ్విన ఆనవాళ్లు



కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు ప్రాంతాల్లో తీరాన్ని దోచేస్తున్నారు. సముద్రపు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. తిమ్మాపురం, మంగమారిపేట, ఉప్పాడ తీర ప్రాంతంలో రాత్రి సమయాల్లో కొందరు లారీలు, మినీ వ్యాన్‌ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలించేస్తున్నారు. దీంతో తీరం వెంబడి అనేక చోట్ల భారీ గోతులు ఏర్పడుతున్నాయి. ఒక్కో గుంత సుమారు 6 నుంచి 8 అడుగుల లోతు వరకు తవ్వేస్తున్నారు. ఇదే నిరంతరం కొనసాగితే సముద్రం ముందుకు వచ్చే ప్రమాదం తప్పదని మత్స్యకారులు హెచ్చరిస్తున్నారు.

అధికారుల తీరు.. మళ్లీ మొదటికే..

గత సంవత్సరం నవంబర్‌లో తీరం వద్ద సముద్ర ఇసుక తవ్వకాలు భారీగా జరిగాయి. మీడియా దీనిని వెలుగులోకి తీసుకురావడంతో ఈ మాఫియాకు కొన్ని రోజులు అడ్డుకట్ట పడింది. మరలా ఇప్పుడు ఇసుక అక్రమ రవాణా భారీ స్థాయిలో జరుగుతోంది. తీరం వెంబడి భారీ గోతులతో ఇసుక మొత్తం ఖాళీ అయిపోతుంది. దీంతో సముద్రం వద్దే చెరువుల వలె ఈ గోతులు కనిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు నామమాత్రంగా కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోకుంటే మంగమారిపేట నుంచి భీమిలి బీచ్ వరకు తీరం వద్ద ఇసుక కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఈ అక్రమ రవాణాపై రెవెన్యూ అధికారులు గాని, పోలీసులు కాని కఠినమైన చర్యలు తీసుకోకపోవడం వలన ఈ అక్రమ రవాణా మరలా మొదలైందని స్థానిక మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖనిజ నిక్షేపాల కోసం..

ఈ సముద్రపు ఇసుకలో అపారమైన ఖనిజ నిక్షేపాలు దాగి ఉండటంతో వీటి కోసమే తవ్వకాలు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భీమిలి తీర ప్రాంతాల్లో 24 రకాల ఖనిజ నిక్షేపాలతో కలిగిన బ్లాకులు ఉన్నాయని గతంలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఇదిలా ఉండగా ఇటీవల పలు చోట్ల తీరంలో ఇసుక నల్లగా కనిపించడం కూడా దీనిని బలపరుస్తోంది. అదే ఇప్పుడు ఇసుక మాఫియాకు వరంగా మారింది. ఇక్కడ ఇసుకలో గార్నెట్, జిర్కోనియం, సిలిమినైట్ వంటి ఖనిజాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ఖనిజ నిక్షేపాల కోసం సముద్ర తీరంలో ఇసుక తవ్వకాలు జరుపుతూ కోట్ల లావాదేవీలు చేతులు మారుతున్నట్లు సమాచారం.

తీరానికి కోత

ఇప్పటికే తుఫాన్ సమయాల్లో రుషికొండ, ఐటీ జంక్షన్, సాగర్‌నగర్, తిమ్మాపురం, మంగమారిపేట, ఉప్పాడ తీర ప్రాంతాల్లో సముద్రం పెద్ద **ఎత్తున కోతకు గురవుతోంది.** తీర ప్రాంతంలో అనధికారికంగా **కాంక్రీట్ నిర్మాణాలు చేపట్ట**డంతో సముద్రపు కెరటాలు ఈ **ప్రాంతాల వైపు దూసుకుని వ**స్తున్నాయి. ఈ క్రమంలో 2 నుంచి **3 అడుగుల వరకు సముద్రం** భారీ ఎత్తున కోతకు గురవుతోంది. **దీనికి తోడు ఈ సముద్రపు** ఇసుక భారీ స్థాయిలో అక్రమ **రవాణా జరగటం తీర** ప్రాంతవాసులను ఆందోళనకు గురి **చేస్తుంది. దీనిపై** సంబంధిత అధికారులు పటిష్టమైన **చర్యలు తీసుకోకుంటే భ**విష్యత్తులో భారీ మూల్యం **చెల్లించక తప్పదని ఇ**క్కడి మత్స్యకారులు ఆం**దోళన వ్యక్తం చే**స్తున్నారు.

అర్ధరాత్రి అక్రమ రవాణా



మంగమారిపేట బీచ్ వద్ద అర్ధరాత్రి సమయాల్లో బీచ్ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. దీనివలన ఈ ప్రాంతాల్లో పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. ఇదే కొనసాగితే సముద్రం మరింత ముందుకు వచ్చేస్తుంది. పరిస్థితులను చూస్తుంటే ఆందోళనగా ఉంది. ఇలాగే కొనసాగితే ప్రకృతి విలయం తప్పదు.

– **అమర్‌నాథ్**, మంగమారిపేట

రాత్రి నిఘా ఏది?



విశాఖ-భీమిలి ప్రధాని రహదారిని **ఆ**నుకుని తీరంలో **ఇ**సుకను అక్రమంగా తవ్వి భారీ స్థాయిలో లారీల్లో **త**రలిస్తుంటే అధికా**రు**లకు కనిపించడం లేదా? **భ**విష్యత్తులో ప్రమాదం **సంభ**విస్తే ఆ పాపం ఎవరి**ది? అధి**కారులు మౌనం వహిస్తే **మత్స్యకా**రులు రోడ్డెక్కుతారు. బీచ్ పెట్రోలింగ్ **పోలీసు**లు రాత్రి సమయాల్లో నిఘా ఎందుకు **ఏర్పాటు** చేయడం లేదు. అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. జరగరానిది జరిగితే ప్రకృతి విలయానికి ప్రభుత్వం, అధికారులే బాధ్యత వహించాలి.

– **దౌలపల్లి కొండబాబు**, 4వ వార్డు కార్పొరేటర్

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం

గతంలో ఇసుక రవాణాపై ఫిర్యాదు అందింది. వెంటనే రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. అప్పటితో సమస్య సద్దుమణిగింది. ఈ అక్రమ రవాణా మరలా ప్రారంభమైంది. అక్రమ రవాణాను అడ్డుకట్టేందుకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తాం. పోలీసుల సమన్వయంతో ఈ ఇసుక రవాణాపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నాం.

– **సంగీత్ మాథూర్**, ఆర్డీవో

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి



బోరుబావికి శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎంపీ జీవీఎల్

పద్మనాభం: వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని రాజ్యసభ మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అనంతవరం, పాత కొవ్వాడ గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి కేంద్రప్రభుత్వం అంగన్‌వాడీ విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు తెలిపారు. పాఠశాలలు, ఆలయాల్లో స్థానికులు, బీజేపీ కార్యకర్తలతో కలసి స్వచ్ఛభారత్ నిర్వహించారు. దీనిలో భాగంగా పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి నిధులతో మూడు తాగునీటి బోరు బావులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్, నాయకులు వేదుల దక్షిణామూర్తి, టి.నాగమణి పాల్గొన్నారు.

'దబ్బంద' వ్యవహారంపై కలెక్టర్ సీరియస్

- వీఆర్వో సస్పెన్షన్
- తహసీల్దార్‌కు షోకాజ్ నోటీస్

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీ దబ్బంద గ్రామంలో రియల్ వ్యాపారులకు లాభం చేకూరేలా పంచాయతీ పాలక వర్గం చేసిన పనులపై కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్ సీరియస్ అయినట్టు తెలిసింది. రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూములకు ప్రయోజనం కలిగేలా కొండలు కొల్లగొట్టి రహదారులు నిర్మించిన సంగతి తెలిసిందే. దీనిపై ఈ నెల 5న సాక్షిలో 'ప్రభుత్వ నిధులతో రియల్ భూములకు రోడ్లు' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిని పరిశీలించిన కలెక్టర్ మండల తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసి, వీఆర్వోను సస్పెండ్ చేసినట్టు ఆలస్యంగా తెలిసింది. దీనిపై మండల వీఆర్వోలు పలువురు శుక్రవారం మాట్లాడుతూ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు చేసిన పనులకు అధికారులు బలిపశువులు అవుతున్నామని వాపోయారు. ఒకవేళ ఎవరైనా తమ పంచాయతీలలో ఫిర్యాదు చేస్తే, తమను సంప్రదించాలని కోరారు. జరిగిన తప్పులు దిద్దుకునేందుకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

'కూటమి ప్రభుత్వానివి మాయమాటలు'



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

తగరపువలస: కూటమి ప్రభుత్వం ఏర్పడి పది మాసాలైనా హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని భీమిలి డివిజన్ సీపీఐ నాయకులు ఆరోపించారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పేదలకు పట్టణ పరిధిలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలాలు ఇస్తామని మాయమాటలు చెప్పారన్నారు. అర్హులకు ఇస్తామన్న రేషన్ కార్డులకు అతీగతి లేదన్నారు. ఈ హామీలు అన్నీ నెరవేరాలంటే ప్రభుత్వాన్ని నేలమీదకు దించవలసిన అవసరం ఉందన్నారు. ప్రజాసమస్యలపై పోరాటాలు చేసి బుద్ధి చెపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి కాసూరి రాంబాబు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, సమితి సభ్యులు ఆదినారాయణ, లక్ష్మణరావు, సన్నిబాబు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కంబాలకొండ నర్సరీలో సిద్ధమవుతున్న నారు



నర్సరీలో సిద్ధం చేసిన మొక్కలు



నారు సిద్ధం చేస్తున్న సిబ్బంది

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు ఎదురుగా అటవీ శాఖకు చెందిన కంబాలకొండ నర్సరీలో వివిధ మొక్కల కోసం నారు సిద్ధం చేస్తున్నారు. అటవీ శాఖ ఇక్కడ అనేక రకాల మొక్కలను ఉత్పత్తి చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు, అడవుల్లోని ఖాళీ స్థలాలు, బయట ప్రాంతాల్లో అటవీ శాఖకు చెందిన ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడానికి ఇక్కడ నుంచే పంపిణీ చేస్తుంటారు. వేసవి కావడంతో ఇక్కడ మొక్కలు నిల్వ ప్రస్తుతం బాగా తగ్గిపోయింది. రానున్న తొలకరి(వర్షా కాలం)కి మొక్కలు నిల్వ ఉంచడానికి కొద్ది రోజులుగా నారు సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ ఆకులు, పేడ, చెత్తతో తయారు చేసిన ఎరువు నింపిన చిన్న బ్యాగుల్లో నారు పోసి మొక్కలు ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం కంబాలకొండ నర్సరీలో రోజ్ వుడ్, సొగసుల చెట్లు, వేప, నేరేడు, గుమ్మడి చెట్టు, బాదం, కానుగ, ఎర్ర చందనం, అంకుడు, అశోక్, తెల్లమద్ది తదితర రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి.

బడుగుల ఆశాజ్యోతి పూలే



తాటితూరు పాఠశాలలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పూలే జయంతి వేడుకలలో పాల్గొన్న పోలీస్ బెటాలియన్ అధికారులు, సిబ్బంది



దాకమర్రిలో పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న తహసీల్దార్ రామారావు



బంగ్లామెట్ట పాఠశాలలో చిన్నారుల నివాళులు

తగరపువలస: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని వక్తలు పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

- సమసమాజ స్థాపనకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు పూలే అని భీమిలి మండలం తాటితూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.సన్యాసినాయుడు అన్నారు. పూలే జయంతి సందర్భంగా పాఠశాలలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు పోతురాజు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.
- భీమిలి మండలం దాకమర్రిలో దళిత కులాల సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పతివాడ రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భీమిలి తహసీల్దార్ పి.రామారావు పూలే విగ్రహానికి పూలమాల వేశారు. యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రవ్వ ఈశ్వరరావు, బోని కృష్ణ, చెల్లూరు నాని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- రెండో వార్డు జీరుపేటలో బీజేపీ అధ్యక్షుడు చిల్ల త్రినాధరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పూలే జయంతి వేడుకల్లో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసినీ ఆనంద్, శీరపు రామలక్ష్మి, మాధవ్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.
- బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నరహరిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. ఉపాధ్యాయులు రెడ్డిపల్లి అప్పలరాజు, ఈగల సంజీవిని, దళిత నాయకులు ఇంటి శాంతి, నరసింగరావు, నిరూషారాణి తదితరులు విద్యార్థులతో కలసి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

పూలే ఆశయ సాధనకు కృషి

మధురవాడ: సామాజిక సమానత్వం కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహాత్ముడు జ్యోతిరావు పూలే అని చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రవి పేర్కొన్నారు. పూలే జయంతి సందర్భంగా విద్యార్థులతో కలసి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- మధురవాడ, పీఎం పాలెం ప్రాంతాల్లో సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాయి, యూనియన్ల నాయకులు డి. అప్పలరాజు, సీహెచ్ శేషుబాబు, డి. సూరిబాబు, రెడ్డి, ఉమ, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.
- రాష్ట్ర బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మధురవాడ విద్యుత్‌శాఖ జోన్-3 కార్యాలయంలో పూలేకు నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బక్కన్నపాలెం పోలీస్ బెటాలియన్‌లో..

పీఎం పాలెం: బక్కన్నపాలెం ఏపీఎస్‌పీ పోలీస్ బెటాలియన్‌లో పూలే చిత్రపటానికి 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళా విద్యను ఆనాడే ప్రోత్సహించిన మహోన్నతుడిగా కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు ఎస్.మురళీధర్, బి.రామకృష్ణ, యూనిట్ మెడికల్ ఆఫీసర్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.



చంద్రంపాలెం హైస్కూల్లో నివాళులు అర్పిస్తున్న హెచ్‌ఎం రవి



మధురవాడలో పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పారిశుధ్య కార్మికులు



చిల్లపేటలో బీజేపీ నాయకుల నివాళి

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: 33/11 కేవీ భీమిలి సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ అంతరాయం కారణంగా భీమిలి, నేరెళ్లవలస, జీవీ అగ్రహారం, కొత్తవలస, నిడిగట్టు, కుమ్మరిపాలెం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థుల రక్తదానం

పీఎం పాలెం: స్థానిక బిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 100 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ నెల 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ రక్తదాన శిబిరం నిర్వహించామని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.శ్రీలక్ష్మి తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ పూర్ణ సత్యనారాయణ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఆరోగ్యకరమైన వ్యక్తి ప్రతీ నాలుగు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌కు చెందిన డాక్టర్ సత్యనారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.